భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌లో డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

డబుల్ ఇండ్లపైనా రాజకీయమా?

పేదల జీవితాలతో స్థానిక ఎమ్మెల్యే ఆటలు

వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి ఫైర్ • భూపాలపల్లిలో లబ్ధిదారులతో కలిసి ధర్నా

కృష్ణకాలనీ, జూన్ 17 : కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపుల పాలన సాగిస్తున్నదని వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని భాస్కర్‌గడ్డలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి 2023 అక్టోబర్‌లో తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం లబ్ధిదారులు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు మద్దతు ప్రకటించిన గండ్ర జ్యోతి రెండు గంటలపాటు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదల కోసం భాస్కర్‌గడ్డలో 462 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి గత అక్టోబర్‌లో 392 మందిని గుర్తించి కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిలో వారికి కేటాయించినట్టు తెలిపారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో ఇంటి పట్టాలు ఇవ్వలేదని, ఎన్నికలు ముగిశాక ఇస్తామని కలెక్టర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రాగా, కొంతమంది అధికార పార్టీ నాయకులు అక్రమంగా ఇండ్లను తీసుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఆరు రోజులుగా పేదలు ధర్నాలు చేస్తుంటే ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పట్టాల్వికపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గండ్ర జ్యోతి హెచ్చరించారు. ఆందోళనలో పాల్గొన్న లబ్ధిదారు తాటికొండ సమ్మక్క సీఐ నరేశ్‌కుమార్ కాళ్ల మీద పడి తన గోడు వెళ్లబోసుకున్నది. 'సార్.. నాకు 30 ఏండ్లుగా ఇల్లు లేదు. కిరాయి ఇండ్లల్లో ఉంటున్న. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నా పేదరికాన్ని గుర్తించి డబుల్ బెడ్రూం ల్లు కేటాయించింది. నా ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టా ఇవ్వకుండా తీసేయాలని చూస్తున్నది. నాకు పట్టా ఇప్పించండి' అంటూ సీఐ కాళ్ల మీద పడటం అక్కడున్న వారిని కలిచివేసింది.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇండ్లకు పట్టాలిప్పించాలని భూపాలపల్లి సీఐ కాళ్లమీద పడుతున్న లబ్ధిదారు తాటికొండ సమ్మక్క

రుణమాఫీపై గందరగోళం!

నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం ఆపసోపాలు

- సర్కార్ ఆదేశాలతో అధికారుల ఉరుకులు పరుగులు
- భూముల తాకట్టు లేదా వేలం, బ్యాంకుల నుంచి రుణం
- వివిధ ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న ప్రభుత్వం
- 35 వేల కోట్లు ఎలా సమకూర్చాలో తెలియక ఆగమాగం
- దగ్గరపడుతున్న గడువు.. కటాఫ్ తేదీపై స్పష్టత కరువు
- మాట నిలుపుకుంటారా? వాయిదా వేస్తారా?

హైదరాబాద్, జూన్ 17(నమస్తే తెలంగాణ): ఇచ్చిన మాట ప్రకారం రైతులు అందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయడం, అందుకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. రుణమాఫీకి అవసరమైన నిధులను సమకూర్చుకునే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నదా? లేదా? అందరికీ ఒకేసారి రుణమాఫీ చేసి మాట నిలుపుకుంటుందా? కొందరికే వర్తింపజేసి చేతులెత్తేస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఆగస్టు 15 గడువు దగ్గరకొస్తున్నప్పటికీ, నిధులు ఎలా సమకూర్చుకోవాలన్న అంశంలో ప్రభుత్వానికి స్పష్టత కొరవడింది. ఆదాయ మార్గాల అన్వేషణ బాధ్యతలను అధికారుల నెత్తిన పెట్టి, రోజుకోరకం లీకేజీలతో రైతుల్లో గందరగోళం సృష్టిస్తున్నది. దీంతో ఉరుకులు, పరుగులు పెడుతున్న అధికారులు ఏమీ చేయాలో, ఎలా చేయాలో తెలియక తలలుపట్టుకుంటున్నారు. రెండు నెలల్లో రుణమాఫీకి అవసరమైన నిధులు సమకూర్చడం అంత సులువు కాదనే అభిప్రాయం అధికార వర్గాల్లో వ్యక్తమవుతున్నది. దీంతో ఏయే కారణాలతో ఎంతమంది రైతులకు కత్తెర వేస్తే ఎంత భారం తగ్గుతుందనే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం.

భూముల అమ్మకమా? అప్పులు చేయడమా?

రుణమాఫీకి దాదాపు రూ.35 వేల కోట్లు అవసరమవుతాయని పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారు. ఈ మేరకు నిధులు సమకూర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ సమర్థతకు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణకు అవకాశం ఉన్న వివిధ ఆదాయ మార్గాలను పరిశీలిస్తున్నది. ముఖ్యంగా రుణమాఫీకి భూములను అమ్మడం, లేదా తాకట్టు పెట్టడం, లేదా అప్పులు చేయడం అనే అంశాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రైతుల రుణాలను ఆ కార్పొరేషన్‌కు బదలాయించుకుంటామని పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే ఇది అంత సులువు కాదనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఒకేసారి ఇంత భారీ మొత్తం కార్పొరేషన్‌కు బదిలీ చేయించుకోవడం సాధ్యమయ్యే పని కాదని, ఇందుకు రిజర్వ్‌బ్యాంకు, కేంద్ర ఆర్థిక శాఖ నుంచి ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు చెప్పినట్టు సమాచారం. దీంతో భూములను అమ్మడం ద్వారా నిధులను సమాకూర్చుకోవాలనే ఆలోచన చేసినట్టు తెలిసింది. ఈ ప్రక్రియ ద్వారా నిధులు సమకూరేందుకు సమయం పట్టే అవకాశం ఉన్నది. దీంతో భూముల అమ్మకం కన్నా.. బ్యాంకులకు తాకట్టు పెట్టడం ద్వారా తక్షణమే నిధులు తీసుకోవచ్చనే అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఏయే భూములను తాకట్టు పెట్టొచ్చనే అంశంపై కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఇవేవీ కుదరని పక్షంలో రాష్ట్రానికి రావాల్సిన అప్పుల వాటాలో అత్యధికం ఇప్పుడే తీసుకొని ఆ నిధులను రుణమాఫీకి వినియోగించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.52 వేల కోట్ల రుణం తీసుకునే వెసులుబాటు రాష్ర్టానికి ఉన్నది. ఈ నేపథ్యంలో ఇందుకు అవసరమైన మేర రుణం తీసుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది. రుణాన్ని మొత్తం ఒక్క రుణమాఫీకే వినియోగిస్తే ఆ తర్వాత మిగిలిన పథకాలకు నిధుల సమస్య తీవ్రమవుతుందని, పథకాలు కొనసాగించలేని పరిస్థితి తలెత్తుతుందని పలువురు అధికారులు సూచించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏవిధంగా ముందుకెళ్లాలో తెలియక తికమక పడుతున్న ప్రభుత్వం రోజుకో లీకేజీ ఇస్తూ రైతుల్లో తీవ్ర గందరగోళం, భయాందోళనలు సృష్టిస్తున్నది. పైన పేర్కొన మార్గాలు ఎంతవరకు సాధ్యమవుతాయనే అంశంపై అధికారుల్లోనే సందేహాలు వ్యక్తమవుతుండటం కొసమెరుపు.

భారం తగ్గించేలా.. కోతలు

రైతులు అందరికీ రుణమాఫీ చేస్తామన్న మాటను నిలబెట్టుకోవాలంటే రూ.35 వేల కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయి. ఈ స్థాయిలో నిధులు సమకూర్చుకోవడం కష్టమని భావిస్తున్న నేపథ్యంలో అర్హుల సంఖ్యలో కోత పెట్టుందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే అత్యంత కఠినమైన నిబంధనలు గల పీఎం కిసాన్ పథకం నిబంధనలను అమలుచేయడం, రేషన్‌కార్డుతో లింక్ పెట్టడం లాంటివి రైతు రుణమాఫీకి వర్తింపచేయాలనే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే రుణమాఫీ భారం రూ.20 వేల కోట్ల నుంచి 23 వేల కోట్లకు తగ్గుతుందని అధికారులు లెక్కలేస్తున్నారు. అయితే, రుణమాఫీకి కూడా అడ్డదిడ్డమైన షరతులు పెట్టి, కోతలు విధిస్తే సగం మంది రైతులు అర్హత కోల్పోతారని, దీంతో వారిలో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతుందని, రాజకీయంగా తీవ్ర నష్టాలు తప్పవనే ఆందోళన కొంత మంది కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతున్నది.

మిగిలిన గడువు రెండు నెలలే

ఏది ఏమైనా సరే ఆగస్టు 15లోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని చెప్పున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఆ దిశగా రోడ్‌మ్యాప్ సిద్ధం చేయలేదు. నిధుల సమీకరణపై ఇప్పటివరకూ స్పష్టత రాలేదు. కటాఫ్ తేదీపైనా స్పష్టత ఇవ్వలేదు. అయితే రెండు తేదీలపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 2023 డిసెంబర్ 7వ తేదీ లేదా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించిన రోజు, సోనియాగాంధీ పుట్టినరోజు అయిన డిసెంబర్ 9వ తేదీలపై పరిశీలన చేస్తున్నట్టు తెలిసింది. నిధులు సమస్య తీవ్రమైతే, మళ్లీ ఏమైనా కుంటి సాకులు చెప్పి రుణమాఫీని వాయిదా వేస్తుందా? అనే చర్చ కూడా జరుగుతున్నది.

బీఈడీ ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులివ్వాలి

జనగామ చౌరస్తా, జూన్ 17: ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ (పీఎస్‌హెచ్ఎం) పదోన్నతి పోస్టుల్లో బీఈడీ అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) కు అవకాశం కల్పించాలని సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనగామలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి.. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి న్యాయమైన తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డీఈవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అంబటి అంజయ్య, సూడి సత్యనారాయణ మాట్లాడుతూ.. బీఈడీ అర్హతతో రాష్ట్రవ్యాప్తంగా ఎస్జీటీలుగా పనిచేస్తున్న 70 వేల మంది ఉపాధ్యాయులు ఒక్క ప్రమోషన్ కూడా లేకుండా అన్యాయానికి గురువుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే పండిట్, పీఈటీ అప్‌గ్రేడేషన్ పోస్టులకు కూడా అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. జీవో 12 ప్రకారం 2015 వరకు బీఈడీ చేసిన వారు పీఎస్‌హెచ్‌ఎం పోస్టులకు అర్హులని, ఇప్పుడు ఎందుకు అర్హులు కాదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే.. అన్ని జిల్లాల్లోని బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలతో దశల వారీగా ఆందోళన చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీ ఉపాధ్యాయులు జయపాల్‌రెడ్డి, బికోజీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం జనగామ కలెక్టరేట్ వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులు

రాష్ట్రంలో శాంతిభద్రతలు ఆగమాగం

- ఢిల్లీకి డబ్బులు పంపే పనిలో సీఎం.. సంపాదనలో మంత్రులు
- సుల్తానాబాద్ ఘటన.. కాంగ్రెస్‌కు చెంపపెట్టు
- బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): గత ఏడు నెలల్లో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విమర్శించారు. వీటిపై కనీసం సమీక్ష చేసే సమయం కూడా ముఖ్యమంత్రికి లేదని మండిపడ్డారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీకి డబ్బులు పంపించే పనిలో ముఖ్యమంత్రి ఉంటే, మంత్రులు వారి సంపాదనలో మునిగిపోయారని ఆరోపించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో రెండు రోజుల క్రితం జరిగిన దారుణ ఘటన కాంగ్రెస్ నేతలకు చెంపపెట్టులాంటిదని దుయ్యబట్టారు. ఆరేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడి హత్య చేయడం సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే ఘటన అని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఇల్లు, రూ.20 లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడు నెలల్లో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, కొత్త ప్రభుత్వం వచ్చాక ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లకు జీతాలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించలేని రాష్ట్ర ప్రభుత్వం చెంపలేసుకుని తప్పును ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో ఇంటి తగాదా వల్ల క్యాబినెట్ విస్తరణ చేపట్టడం లేదని, కనీసం హోంమంత్రి, విద్యాశాఖ మంత్రిని కూడా నియమించడం లేదని దుయ్యబట్టారు.

పదోన్నతులు, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న టీజీటీఏ నేతల ప్రతినిధి బృందం

రెవెన్యూలో అధికార వికేంద్రీకరణ జరపాలి

- మంత్రి పొంగులేటికి టీజీటీఏ విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖలో అధికారాల వికేంద్రీకరణ జరపాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) నాయకులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. హైదరాబాద్ నాంపల్లిలోని టీజీటీఏ కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రాములు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ధరణి, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యలు, పదోన్నతులపై వినతిపత్రం సమర్పించారు. అధికారాలన్నీ కలెక్టర్ల దగ్గర కేంద్రీకృతం అయి ఉన్నందున భూ సమస్యల పరిష్కారం ఆలస్యం అవుతున్నదని మంత్రి వివరించారు. రైతులకు మరింత చేరువయ్యేందుకు భూ పరిపాలనలో సమగ్రమైన మార్పులు తేవాలని, గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. జీవో 317 రద్దుతో పాటు రెవెన్యూ కోర్టులు, అప్పిలేట్ అథారిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణ, టీజీటీఏ ప్రధాన కార్యదర్శులు రమేష్ పాక, అరేటి రాజేశ్వర్, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ హన్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, కోశాధికారి శ్రీనివాస్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే నియమించాలి

- లేకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాం: బీజేపీ

హైదరాబాద్, జూన్ 17(నమస్తే తెలంగాణ): బ్రాహ్మణ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే నియమించాలని బీజేపీ ఎండోమెంట్ సెల్ కార్యవర్గ సభ్యుడు సుదర్శన్ ప్రసాద్ తివారీ డిమాండ్ చేశారు. పదిరోజుల్లోగా ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే వేలాదిమంది బ్రాహ్మణులతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అన్ని పాలకవర్గాలను నియమిస్తున్నప్పటికీ బ్రాహ్మణ పరిషత్‌ను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. పేద బ్రాహ్మణుల సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం బ్రాహ్మణ పరిషత్ పాలకవర్గం అవసరమని, గత ఏడు నెలలుగా పాలకవర్గం లేకపోవడంవల్ల సంక్షేమ కార్యక్రమాలన్నీ నిలిచిపోయాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ దరఖాస్తుల పరిష్కారానికి వెంటనే నిధులను విడుదల చేయాలని కోరారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, అర్చకులకు నెలనెలా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బక్రీద్ వేళ కాంగ్రెస్ ఎమ్మెల్యే వివాదాస్పద పోస్టర్

- తప్పును అంగీకరించి క్షమాపణ కోరిన కుంభం అనిల్‌కుమార్

భువనగిరి కలెక్టరేట్, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకొనే బక్రీద్ పండుగ వేళ.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పేరుతో సోషల్ మీడియాలో సోమవారం వివాదాస్పద పోస్టర్ వైరల్ అయ్యింది. కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు ఓ పోస్టర్‌ను క్రియేట్ చేశారు. అందులో మేకకు బదులుగా ఆవు ఫొటో ఉండటంతో హిందువులు, హిందుత్వ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆ పోస్టర్ హిందువులను కించపరిచేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే కుంభం వివరణ ఇస్తూ.. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. తన సోషల్ మీడియా టీమ్ పొరపాటున మేక ఫొటోకు బదులు ఆవు ఫొటో పెట్టిందని తెలిపారు. ఇది తనకు కూడా చాలా ఇబ్బందికరంగా ఉందని, ఎవరైనా మానసికంగా ఇబ్బంది పడినట్లైతే క్షమించాలని కోరారు. తానూ హిందువునేనని, ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన పోస్టర్‌ను వెంటనే తొలగించామని వివరించారు.

ఆరు నెలల్లో మూడోసారి!

రాష్ట్రంలో ఐపీఎస్‌ల బదిలీ
28 మందికి స్థాన చలనం

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 28 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు ఐపీఎస్‌లకు ఐదారు నెలల్లో మూడుసార్లు స్థాన చలనం అయింది. రాహుల్‌హెగ్డేకు గతంలో సిటీ ట్రాఫిక్ విధులు నిర్వర్తించిన అనుభవం ఉండడంతో ఇప్పుడు ఆయనను హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ చేశారు. టీ శ్రీనివాసరావు గతంలో సైబరాబాద్ ట్రాఫిక్‌లో ఉండగా, బాలానగర్ డీసీపీగా మార్చారు. మళ్లీ అక్కడి నుంచి ఇప్పుడు జోగులాంబ గద్వాల్ ఎస్పీగా బదిలీ చేశారు. సుబ్బారాయుడు గతంలో కరీంనగర్ సీపీగా చేయగా, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా వేశారు. ఇప్పుడు నేరుగా డీజీపీ ఆఫీస్‌కు రిపోర్ట్ చేయమని ఆదేశించారు. బదిలీల అనంతరం మంచి పోస్టింగ్ ఇవ్వాలన్న ఉద్దేశంతోనే డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేసినట్టు తెలిసింది. జానకీ ధరావత్ గతంలో మల్కాజిగిరి డీసీపీగా పనిచేయగా, ఆమెను సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీగా, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఎస్పీగా బదిలీ చేశారు. విశ్వజిత్ కాంపాటి జీహెచ్ఎంసీలో డీఆర్ఎఫ్ విభాగానికి పనిచేశారు. ఆ తర్వాత టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా పనిచేశారు. ఇప్పుడు అక్కడి నుంచి సీఐడీకి బదిలీ చేశారు. నితికా పంత్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్‌లో పనిచేశారు. తర్వాతి బదిలీల్లో మేడ్చల్ జోన్ డీసీపీ, అక్కడి నుంచి ఆదిలాబాద్ కమాండెంట్ సెకండ్ బెటాలియన్‌కు బదిలీ చేశారు. పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా కొనసాగుతున్న శరత్‌చంద్ర పవార్‌ను హైదరాబాద్ సెంట్రల్‌జోన్ డీసీపీగా నియమించారు. అనంతరం నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా బదిలీ చేశారు. ఇప్పుడు నల్లగొండ ఎస్పీగా బదిలీ చేశారు. హైదరాబాద్ నార్త్‌జోన్ డీసీపీగా ఉన్న చందనాదీప్తి కొన్నాళ్లు వెయిటింగ్‌లో ఉన్నారు. ఆ తర్వాత కొత్త ప్రభుత్వ పోస్టింగ్‌లో నల్లగొండ ఎస్పీగా నియమించి.. కొన్నాళ్లకే మళ్లీ సికింద్రాబాద్ రైల్వే ఎస్పీగా బదిలీ చేశారు. రష్మీ పెరుమాళ్ కూడా సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ నుంచి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌కు పంపారు. ఇప్పుడు నార్త్‌జోన్‌కు బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
1) అశోక్‌కుమార్	డీసీపీ మంచిర్యాల	జగిత్యాల ఎస్పీ
2) సన్‌ప్రీత్‌సింగ్	జగిత్యాల ఎస్పీ	సూర్యాపేట ఎస్పీ
3) రాహుల్‌హెగ్డే	సూర్యాపేట ఎస్పీ	హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ
4) ఎల్ సుబ్బారాయుడు	హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్టు
5) టీ శ్రీనివాసరావు	డీసీపీ బాలానగర్	జోగులాంబ గద్వాల ఎస్పీ
6) రితిరాజ్	జోగులాంబ గద్వాల ఎస్పీ	జాయింట్ డైరెక్టర్ ఏసీబీ
7) డీవీ శ్రీనివాసరావు	డీసీపీ మేడ్చల్ ట్రాఫిక్	కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ
8) కే సురేశ్‌కుమార్	కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ	డీసీపీ బాలానగర్
9) జానకీ ధరావత్	డీసీపీ సౌత్‌ఈస్ట్ జోన్ హైదరాబాద్	మహబూబ్‌నగర్ ఎస్పీ
10) హర్షవర్ధన్	మహబూబ్‌నగర్ ఎస్పీ	సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ
11) విశ్వజిత్ కాంపాటి	సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ	సీఐడీ ఎస్పీ
12) బీ రాజేశ్	ఎస్ఐబీ ఇంటెలిజెన్స్	డీసీపీ శంషాబాద్
13) కే నారాయణరెడ్డి	శంషాబాద్ డీసీపీ	వికారాబాద్ ఎస్పీ
14) ఎన్ కోటిరెడ్డి	వికారాబాద్ ఎస్పీ	డీసీపీ మేడ్చల్ జోన్
15) నితికాపంత్	డీసీపీ మేడ్చల్	రెండో బెటాలియన్ కమాండెంట్
16) పీజేపీసీ ఛటర్జీ	రెండో బెటాలియన్ కమాండెంట్	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్టు
17) శరత్‌చంద్ర పవార్	నార్కోటిక్ బ్యూరో ఎస్పీ	నల్లగొండ ఎస్పీ
18) జీ చందనాదీప్తి	నల్లగొండ ఎస్పీ	సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ
19) షేక్ సలీమా	సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ	వరంగల్ డీసీపీ సెంట్రల్ జోన్
20) ఎంఏ బరి	వరంగల్ డీసీపీ సెంట్రల్ జోన్	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్టు
21) పీ సాయి చైతన్య	ఎస్పీ (వెయిటింగ్)	నార్కోటిక్ బ్యూరో ఎస్పీ
22) సధాన రష్మీ పెరుమాళ్	హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ	నార్త్‌జోన్ డీసీపీ హైదరాబాద్
23) రోహిణి ప్రియదర్శిని	నార్త్‌జోన్ డీసీపీ హైదరాబాద్	7వ బెటాలియన్ కమాండెంట్ డిచ్‌పల్లి
24) బీ రామ్‌ప్రకాశ్	7వ బెటాలియన్ కమాండెంట్ డిచ్‌పల్లి	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్టు
25) బీ రాజామహేంద్ర నాయక్	ఇంటెలిజెన్స్ ఎస్పీ	వెస్ట్‌జోన్ డీసీపీ జనగాం, వరంగల్
26) పీ సీతారాం	వెస్ట్‌జోన్ డీసీపీ జనగాం, వరంగల్	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్టు
27) ఏ భాస్కర్	నార్కోటిక్ బ్యూరో ఎస్పీ	డీసీపీ మంచిర్యాల, రామగుండం
28) డాక్టర్ పాటిల్ సంగ్రామ్‌సింగ్‌గణపత్‌రావు	వెయిటింగ్	జీజీడీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)

మెరిట్‌ను పరిగణించాలి

ఓ ఉద్యోగ భర్తీలో ఎస్పీడీసీఎల్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీలో రాష్ట్రపతి ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోరాదని ఎస్పీడీసీఎల్‌ను హైకోర్టు ఇటీవల ఆదేశించింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా నాన్‌లోకల్‌గా పరిగణించి నియామకాలు చేపట్టరాదని తెలిపింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా తనను స్థానికేతర కోటా కింద అభ్యర్థిగా పరిగణించడాన్ని సవాలు చేస్తూ కామారెడ్డి జిల్లాకు చెందిన టీ గోపాల్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ టీ మాధవీదేవి విచారణ చేపట్టగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీ నిమిత్తం 2019లో జారీ అయిన నోటిఫికేషన్ ఆధారంగా చేపట్టే నియామకాలకు రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తిస్తాయంటూ 2021లో ఎస్పీడీసీఎల్ జనరల్ మేనేజర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారని తెలిపారు. ఈ ప్రొసీడింగ్స్ రాష్ట్రపతి ఉత్తర్వులకు, ప్రభుత్వం 2018లో జారీచేసిన 124, 132 జీవోలకు విరుద్ధమని అన్నారు. పిటిషనర్‌కు 56 మార్కులు వచ్చాయని, 18వ ర్యాంకు సాధించారని చెప్పారు. అయినప్పటికీ స్థానికేతరుడిగా ఐదు శాతం కోటా కింద పరిగణనలోకి తీసుకుందని అన్నారు. ఎస్పీడీసీఎల్‌కు రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవంటూ గతంలో ఇదే హైకోర్టు వెలువరించిన తీర్పు పిటిషనర్‌కు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి పిటిషనర్ మెరిట్ ఆధారంగా రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రస్తావన లేకుండా నియామక ఉత్తర్వులు ఇవ్వాలని ఎస్పీడీసీఎల్‌కు ఉత్తర్వులు జారీచేశారు.

26న స్థానికతపై విచారణ

వివిధ పోస్టుల భర్తీ వ్యవహారంలో స్థానికత వివాదంపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దాఖలు చేసిన అప్పీళ్లపై ధర్మాసనం ఈ నెల 26న విచారణ చేపట్టనుంది. రాష్ట్రపతి ఉత్తర్వులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 124లో స్థానిక నిబంధనల పరిగణనలో కొన్ని లోపాలున్నప్పటికీ ఎంపికైన అభ్యర్థులను స్థానికులుగా పరిగణనలోకి తీసుకోవాలంటూ వివిధ పిటిషన్లలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే.

మేడారంలో ప్లాస్టిక్ నిషేధం

తాడ్వాయి, జూన్ 17 : ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క, సారలమ్మ సన్నిధిలో ప్లాస్టిక్‌ను నిషేధించినట్టు పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను వినియోగించవద్దని, భూమిలో సులభంగా కలిసిపోయి పర్యావరణానికి ఎలాంటి హాని చేయని బయోడిగ్రేడిబుల్ సంచులను వాడాలని దుకాణాల యజమానులకు సూచించారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు కూడా అవగాహన కల్పించారు. సోమవారం మేడారం జాతర పరిసరాల్లోని దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను సమ్మక్క-సారలమ్మ పూజారులు, అభ్యుదయ యువజన సంఘం సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. మరోసారి వ్యాపారులు ప్లాస్టిక్ వినియోగిస్తే కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు.

రేపు బీజేపీ 'సెల్యూట్ తెలంగాణ'

- రాష్ట్రానికి కిషన్‌రెడ్డి, బండి సంజయ్
- బేగంపేట నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు ర్యాలీ

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ నెల 19న రాష్ర్టానికి వస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి 'సెల్యూట్ తెలంగాణ' పేరుతో సన్మాన సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పదాధికారులు, మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం జరిగింది. అనంతరం కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర మంత్రులు బేగంపేట విమానాశ్రయానికి చేరిన తర్వాత రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర కార్యాలయం వద్ద సన్మానం చేస్తామన్నారు. అనంతరం కేంద్ర మంత్రులు పాత నగరంలోని భాగ్యలక్ష్మి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు 35 శాతానికిపైగా బీజేపీకి ఓట్లు వేశారని, ఇందుకు బీజేపీ జాతీయ నాయకత్వం ఆధ్వర్యంలో త్వరలో రాష్ట్రంలో భారీ కృతజ్ఞత సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జమ్ముకశ్మీర్ ఎన్నికల ఇంచార్జిగా కిషన్‌రెడ్డి

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే నాలుగు రాష్ట్రాలకు బీజేపీ ఇంచార్జీలను నియమించింది. జమ్ము కశ్మీర్ ఎన్నికల ఇంచార్జ్‌గా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఎంపిక చేసింది. హర్యానాకు ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్ కుమార్ దేవ్, మహారాష్ట్రకు భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్, జార్ఖండ్‌కు శివరాజ్ సింగ్ చౌహాన్, హిమంత బిశ్వశర్మను ఇంచార్జీలుగా నియమించింది.